## అడుగడుగునా గోతులు, గతుకులు

- అధ్వానంగా 'నాతవరం' రహదారులు
- ఐదేళ్లుగా నిర్వహణను గాలికొదిలేసిన ప్రభుత్వం
- పలుచోట్ల పూర్తి ఛిద్రమైన తుని-నర్సీపట్నం రోడ్డు

· 7లో



# టీడీపీలో జోష్!

తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం

## లోకేశ్ 'శంఖారావం' సభలు విజయవంతం

- సూపర్ సిక్స్ పథకాలను జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి
- ఎన్నికల్లో టీడీపీ-జనసేన గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి
- కేడర్‌కు దిశానిర్దేశం చేసిన నారా లోకేశ్
- వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను బయటపెట్టిన యువనేత



వడ్డాది శంఖారావం సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ శ్రేణులు (ఫైల్)



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పేరుతో జిల్లాలో చేపట్టిన రెండు రోజులపాటు పర్యటన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఐదు నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలు విజయవంతం కావడంతో నాయకులు, కార్యకర్తలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, టీడీపీ హయాంలో అమలు చేసిన పలు పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం, వివిధ వర్గాల వారికి ఇచ్చిన హామీలను సీఎం జగన్ అమలు చేయకపోవడం, అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల అవినీతి, అక్రమాల గురించి సోదాహరణంగా వివరించిన లోకేశ్.. వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ కేడర్‌కే దిశానిర్దేశం చేశారు. వైసీపీ ప్రభుత్వం బనాయించే తప్పుడు కేసులను, వేధింపులకు భయపడొద్దని కార్యకర్తలకు మనోధైర్యాన్ని నింపారు. జనసేన, టీడీపీ పొత్తుపై వైసీపీ పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారం చేస్తున్నదని, ఇటువంటి వాటిని ఇరు పార్టీల నేతలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలకు టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నామినేటెడ్ పదవులు ఇచ్చే బాధ్యత తీసుంటానని లోకేశ్ భరోసా ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలు, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలను ప్రతీ గడపకు తీసుకువెళ్లడంలో ఉత్తమ పనితీరు చూపిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు.

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన శంఖారావం సభలకు విశేష స్పందన రావడంపై రాజకీయ వర్గాల్లో చర్చకు జరుగుతోంది. వైసీపీ అవినీతి, అరాచక పాలనను అంతమొందించేందుకు రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన శ్రేణులు సైనికుల్లా సమరోత్సాహంతో పనిచేయాలని లోకేశ్ ఇచ్చిన పిలుపునకు విశేష స్పందన లభించింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి రూపొందించిన సూపర్-6 పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లా అభివృద్ధిని పక్కన పెట్టేసి, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ లోకేశ్ బలమైన ఆరోపణలు చేశారు. ఎన్నికల తరువాత ఏర్పాటయ్యేది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని, అందరి అవినీతి సంగతి తేల్చుతామని వైసీపీ నేతలను ఉద్దేశించి హెచ్చరించారు.

### మంత్రి అమర్‌పై వ్యంగ్య విమర్శలు

అనకాపల్లిలో జరిగిన శంఖారావం సభలో కోడిగుడ్డు మంత్రి అంటూ పరోక్షంగా ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఒక్క పరిశ్రమ కూడా తేలేదని, ఒక్క నిరుద్యోగికి కూడా ఉపాధి కల్పించలేదని దుయ్యబట్టారు. అభివృద్ధి చేయకపోయిన కోడిగుడ్డు మంత్రి.. కశింకోట మండలంలో 600 ఎకరాలు దోచేశారని, మంత్రికి గంజాయి వ్యాపారులతో సంబంధాలు ఉన్నాయని, తన అనుచరులు, బినామీలతో ఇసుక, గ్రావెల్, మట్టి దందా సాగిస్తున్నారని లోకేశ్ ఆరోపించారు.

### ప్రభుత్వ విప్‌పై విసుర్లు

చోడవరం నియోజకవర్గం వడ్డాది జరిగిన సభలో.. స్థానిక ఎమ్మెల్యేని ఎండగట్టారు. 'పేరు ధర్మశ్రీ... చేసేవన్నీ అధర్మాలే'నని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో రోడ్లు కూడా వేయించుకోలేని ... మిగతా 8వ పేజీలో

# అమ్మఒడి, ఆసరా డబ్బు తినడమే కాదు..



## అప్పుడప్పుడు అధికారులు చెప్పే మాట కూడా వినాలి

- వైసీపీ సభలకు రాకపోతే మీకు పథకాలు ఉండవు... మాకు ఉద్యోగాలు ఉండవు..
- ఇళ్లలో పనులు చేసుకుంటారో... మానేస్తారో మాకు అనవసరం
- సీఎంకు స్వాగతం చెప్పడానికి రావాల్సిందే
- మహిళా సంఘాలకు యూసీడీ సిబ్బంది హుకుం
- మండుటెండలో మహిళల అగచాట్లు
- ప్రతి గ్రూపు సభ్యులు జాబితా చేతిలో పట్టుకుని మరీ హాజరు నమోదు
- ప్రతిసారీ పార్టీ కార్యక్రమాలకు రమ్మనడం సమంజసంగా లేదంటూ మహిళల గగ్గోలు



విమానాశ్రయం వద్ద హైవేపై ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

"కొద్దిరోజులు కిందట జరిగిన ఆడుదాం...ఆంధ్రా' కార్యక్రమానికి అధికారులు బస్సులు పెట్టారు. ఒక్కరూ రాలేదు. దీంతో కార్యక్రమం జనం లేక ఫెయిల్ అయ్యింది. సీఎంతో అధికారులు చీవాట్లు తినాల్సి వచ్చింది. అప్పుడు మనం చేసిన తప్పుకు ఇప్పుడు (బుధవారం) శిక్షగా రోడ్డుపక్కన నిలబడి మనం స్వాగతం పలకాలి. అందరినీ తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ నుంచి డైరెక్టుగా ఆదేశాలు వచ్చాయి. అందరూ రావాల్సిందే. ఉదయం తొమ్మిదయ్యేసరికి మనమంతా రోడ్డుపై ఉండాలి. పనులు ఉన్నాయని చెబితే కుదరదు. పనులు చేసుకుంటారో...పక్కనపెట్టేసి వస్తారో మాకు తెలియదు. గ్రూపు సభ్యులంతా రావాల్సిందే. ప్రభుత్వం ఇచ్చే అమ్మఒడి, ఆసరా వంటి పథకాలతో వచ్చే డబ్బు తినడమే కాదు...అప్పుడప్పుడు అధికారులు చెప్పే మాట కూడా వినాలి. లేకపోతే పథకాలు ఆపేస్తారు. మీరు రాకపోతే మీకు పథకాలు ఉండవు...మాకు ఉద్యోగం ఉండదు..ఉదయాన్నే కొళాయిలు కూడా ఇవ్వరు. కాబట్టి నీటి కోసం ఆలోచన చేయక్కర్లేదు."

- ఇదీ డ్వాక్రా సంఘాల గ్రూపుల్లో రీసోర్స్‌పర్సన్లు పెట్టిన మెసేజ్

నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు రావాలంటూ డ్వాక్రా సంఘాల సభ్యులపై రీసోర్స్ పర్సన్ల ద్వారా జీవీఎంసీ అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. కొద్దిరోజుల కిందట నగరంలో సీఎం పాల్గొన్న 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుక జనం లేక అట్టర్ ఫ్లాప్ అయింది. దీంతో అధికారులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేశారనే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మరోమారు చీవాట్లు తినకూడదని అధికారులు ముందుజాగ్రత్త పడ్డారు. బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు భారీగా జనాలను సమీకరించాలని నిర్ణయించారు. సీఎం ఎయిర్‌పోర్టులో దిగినప్పటి నుంచి చినముషిడివాడలో గల ... మిగతా 8వ పేజీలో



శారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి (-వార్త మెయిన్ ఎడిషన్‌లో)

# ధాన్యం సొమ్ముకు నిరీక్షణ

అటకెక్కిన 'మూడు వారాల్లోపు జమ' హామీ

- మాకవరపాలెం మండలంలో సగం మందికిపైగా రైతులకు అందని సొమ్ములు
- ఎప్పుడు జమ అవుతాయో తెలియదంటున్న అధికారులు



ధాన్యాన్ని ట్రాక్టర్‌పై రైస్ మిల్లుకు తరలిస్తున్న రైతు

మాకవరపాలెం, ఫిబ్రవరి 21:

**ప్రకృతితోపాటు ప్రభుత్వం కూడా తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని వరి రైతులు వాపోతున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట సరిగా పండలేదని, చేతికి వచ్చిన పంటను ప్రభుత్వానికి విక్రయిస్తే నెల రోజులు దాటినా ధాన్యం డబ్బులు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులను అడిగితే.. ధాన్యం సేకరించడం వరకే తమ బాధ్యత అని, డబ్బులు జమ తమ చేతుల్లో లేదని అంటున్నారని రైతులు వాపోతున్నారు.**

మాకవరపాలెం మండలంలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3,500 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. తరువాత సరిపడ వర్షాలు పడకపోవడంతో కొన్నిచోట్ల అందుబాటులో వున్న నీటి వనరులను డీజిల్ ఇంజన్ల సాయంతో పొలాలకు పెట్టుకోవాల్సి వచ్చింది. ఆ మాత్రం అవకాశం లేని గ్రామాల్లో వరి నాట్లు ఎండిపోయాయి. తరువాత పంట కోతకు వచ్చిన తరుణంలో డిసెంబరు మొదటి వారంలో తుఫాన్ సంభవించిఇ భారీ వర్షాలు కురిశాయి. అప్పటికే కోత కోసి, కుప్ప వేయని వరిపనలు తడిసి ముద్దవ్వగా, కోత కోయని పొలాల్లో పైరు నేల వాలి ముంపునకు గురైంది. మొత్తం మీద 1,350 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇంతవరకు రైతులకు పరిహారం అందలేదు. ఈ విషయం పక్కన పెడితే.. పంట సవ్యంగా పండిన రైతులు, ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నారు. ఈ ప్రక్రియ గత ఏడాది డిసెంబరు 27వ తేదీన ప్రారంభమైంది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం సాధారణ రకం క్వింటా రూ.2,183, ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2,203కు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్టు పౌర సరఫరాల సంస్థ అధికారులు ప్రకటించారు. వరి కుప్పలు నూర్చిన రైతులు, ఆర్‌బీకేలకు సమాచారం అందిస్తే సిబ్బంది వచ్చి ధాన్యంలో తేమ శాతం, ఇతరత్రా అంశాలను పరిశీలిస్తారని, అనంతరం తూకం వేయించి రైస్ మిల్లుకు తరలిస్తారని తెలిపారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. దీంతో మండలంలో పలు గ్రామాలకు చెందిన రైతులు డిసెంబరు చివరి వారం నుంచి ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయిస్తున్నారు. ఇంతవరకు సుమారు 400 టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థకు విక్రయించి, తమకు కేటాయించిన రైస్ మిల్లులకు రైతులు తరలించారు. కానీ ఇంతవరకు సగం మంది రైతులకు కూడా ధాన్యం డబ్బులు అందలేదు. వీరిలో అత్యధికులు ధాన్యం విక్రయించి మూడు వారాలు దాటింది. గిడుతూరు గ్రామానికి చెందిన పి.చినబాబు 10 టన్నులు, మాకవరపాలెం గ్రామానికి చెందిన చింతకాయల తాతీయలు ఎనిమిది టన్నులు, చింతకాయల దాలపాత్రుడు రెండు టన్నులు, నైదాన అప్పలనాయుడు మూడు టన్నులు, రాచపల్లికి చెందిన రుత్తల సత్యనారాయణ మూడు టన్నులు ధాన్యాన్ని విక్రయించి నెల రోజులు దాటిందని చెబుతున్నారు. వీరిలో ఒక్కరికి కూడా బ్యాంకు ఖాతాలో ధాన్యం డబ్బులు జమ కాలేదని చెబుతున్నారు.

# మంత్రి X ఎమ్మెల్యే

## అచ్యుతాపురం సెజ్‌పై ఆధిపత్యానికి పోరు

- అచ్యుతాపురం సెజ్‌లో దందాలకు ఆధిపత్యపోరు
- అమర్ మంత్రి కాకముందు ఎమ్మెల్యే కన్నబాబురాజు వర్గీయులదే పైచేయి
- రెండేళ్ల నుంచి పెరుగుతున్న అమర్ అనుచరుల పెత్తనం



అమర్‌నాథ్



కన్నబాబురాజు

- తాజాగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఎర్త్ వర్క్ కాంట్రాక్టు విషయంలో గొడవ
- టెండర్ దక్కించుకున్న మంత్రి వర్గీయులు
- పనులను అడ్డుకున్న ఎమ్మెల్యే మద్దతుదారులు
- పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- గతంలో అభిజిత్ ఫ్లై యాష్ విషయంలోనూ ఇదే తీరు!

అచ్యుతాపురం, ఫిబ్రవరి 21:

ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్ఈజెడ్)లో పనుల కాంట్రాక్టుల విషయంలో అధికార పార్టీకి చెందిన పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్, ఎలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు వర్గాల మధ్య కొంతకాలం నుంచి అంతర్గత పోరు సాగుతున్నది. ఇది క్రమేణా పెరిగిపోయి కొత్తగా ఏర్పాటు చేయనున్న 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ భూమి చదును పనుల కాంట్రాక్టు విషయంలో బహిర్గతం అయ్యింది. కాంట్రాక్టును మంత్రి అనుచరుడు దక్కించుకుని పనులు చేపట్టగా, ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకుని నిలుపుదల చేయించారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్న స్థలం

ప్రత్యేక ఆర్థిక మండలిలోని కంపెనీలపై పెత్తనం విషయంలో రెండేళ్ల క్రితం వరకు స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తిరాజుది పైచేయిగా వుండేది. అమర్‌నాథ్ పరిశ్రమల శాఖ మంత్రి అయిన తరువాత ఎమ్మెల్యే పెత్తనానికి గండికొట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. వైసీపీలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు తీరును వ్యతిరేకించేవారు మంత్రి చెంతన చేరి, సెజ్‌లో పట్టు బిగించడానికి చాప కింద నీరులా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎస్ఈజెడ్ పరిధిలోని అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో వైసీపీ ద్వితీయ శ్రేణి నేతల్లో కొంతమంది మంత్రి అమర్ వర్గీయులుగా, మరికొందరు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అనుచరులుగా విడిపోయారు. వీరు గత కొంతకాలం నుంచి నిర్వాసితుల పేరుతో దందాలు చేయడం, సెజ్ కర్మాగారాల యాజమాన్యాలు, వర్క్ కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు దండుకోవడం వంటివి యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెజ్‌లోని ఒక టైర్ల కర్మాగారానికి ఎదురుగా సుమారు 20 ఎకరాల్లో 400/220 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ భూమి చదును, ఎత్తు పనులకు సంబంధించి రూ.4 కోట్ల ... మిగతా 8వ పేజీలో

## నేడు ఉప రాష్ట్రపతి రాక

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ మిలాన్-24లో పాల్గొనడానికి గురువారం సతీసమేతంగా విశాఖపట్నం వస్తున్నారు. వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో ఉదయం ఎనిమిది గంటలకు ఢిల్లీలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో దిగుతారు. సముద్రిక ఆడిటోరియంలో జరిగే ఇంటర్నేషనల్ మేరీటైమ్ సదస్సులో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు అక్కడి ఉండి తిరిగి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిపోతారు.

## ప్రొటోకాల్ బాధ్యతల నుంచి అమర్‌కు ఉద్వాసన?

- ఉప ముఖ్యమంత్రి బూడికి అవకాశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మరో షాక్ తగిలింది. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటివరకూ టికెట్ కేటాయించని అధిష్ఠానం తాజాగా ప్రొటోకాల్ బాధ్యతల నుంచి కూడా ఆయన్ను తప్పించింది. విశాఖపట్నానికి వీవీఐపీలు ఎవరు వచ్చినా వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున విమానాశ్రయంలో స్వాగతం పలికే ప్రొటోకాల్ బాధ్యతలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిర్వహిస్తున్నారు. గతంలో రాష్ట్రపతి వచ్చినప్పుడు కూడా ఆయనే స్వాగతం పలికారు. అయితే ఆకస్మికంగా ఆయన్ను తప్పించి, ఉమ్మడి జిల్లాకు చెందిన మరో మంత్రి బూడి ముత్యాల నాయుడుకు ఆ బాధ్యత అప్పగించారు. ఇది వైసీపీ వర్గాల్లో చర్చకు దారితీసింది.



## ప్రపంచ సంస్కృతికి ప్రతిబింబం...మిలాన్ గ్రామం




మిలాన్ సందర్భంగా రక్షణ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఉంచిన రాకెట్ లాంచర్లు

నావల్ డాక్‌యార్డులోని సముద్రిక ఆడిటోరియం సమీపాన ఏర్పాటు చేసిన మిలాన్ గ్రామాన్ని బుధవారం సాయంత్రం కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. కొత్త ఆవిష్కరణలను వివరించే పారిశ్రామిక ప్రదర్శనను ఆయన తిలకించారు.

- వార్త 7వ పేజీలో..



మిలాన్ గ్రామంలో పారిశ్రామిక ప్రదర్శనను తిలకిస్తున్న కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

క్రైం... crime news

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

» మరొకరికి గాయాలు

**ఎలమంచిలి, ఫిబ్రవరి 21:** మండలంలోని పురుషోత్తపురం జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రుక్మిణీపురం గ్రామానికి చెందిన ఆర్.సత్యనారాయణ(67), అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై పురుషోత్తపురంలో జరిగే వారపు సంతకు బయలుదేరారు. జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో సత్యనారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అయనను అనకాపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆ వాహనం వెనుక సీట్లో కూర్చున్న వ్యక్తికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## గో రక్షణ పేరుతో డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు

**ఎస్.రాయవరం, ఫిబ్రవరి 21:** మండలంలో గో రక్షణ పేరుతో జాతీయ రహదారిపై వెళుతున్న పశువుల వాహనాలను వెంబడించి గో రక్షణ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు అందిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తి రాజేరు మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన గిరీష్ అనే వ్యాన్ డ్రైవర్ ఈ నెల 18న శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నుంచి తుని సంతకు పశువులను తరలిస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో మండలంలోని పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై కొందరు వాహనాన్ని నిలిపారు. తాము గో రక్షణ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులమని చెప్పి తన వద్ద నుంచి రూ.5 వేలు దౌర్జన్యంగా తీసుకున్నారని వ్యాన్ డ్రైవర్ గిరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గో రక్షణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొర్ల దేముడుతో పాటు మరో ఆరుగురిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా తమపై శ్రీను, చిన్న అనే ఇద్దరు వ్యక్తులు దాడి చేశారంటూ గో రక్షణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొర్ల దేముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

## 48 మద్యం సీసాలు స్వాధీనం

**పరవాడ, ఫిబ్రవరి 21:** తానాం గ్రామంలో ఓ పాన్‌షాపుపై దాడులు చేసి 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపారు. ఆ గ్రామానికి చెందిన సిరపు వెంకటలక్ష్మి పాన్‌షాపులో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో బుధవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. షాపు యజమాని వెంకటలక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## 90 లీటర్ల నాటుసారాతో ఒకరి అరెస్టు

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 21:** మండలంలోని నీలకంఠాపురంలో 90 లీటర్ల నాటుసారాతో ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. నీలకంఠాపురంలో నాటుసారా అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని, సారా విక్రయిస్తున్న యన్నంశెట్టి చెల్లంనాయుడును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని, అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి నిందు రిమాండ్‌కి తరలించామని ఎస్ఐ చెప్పారు.

## శారదా నదిలో మునిగి వ్యక్తి మృతి

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21:** శారదా నదిలో స్నానానికి దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ టైలర్‌పేటకు చెందిన బంగారు దుర్గా ప్రసాద్, కుమారుడు దిలీప్ ఈ నెల 17వ తేదీన అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం ఇద్దరూ కలిసి సమీపంలోని శారదా నదిలో స్నానానికి వెళ్లారు. దుర్గాప్రసాద్ నదిలో దిగుతుండగా జారిపడి నీటిలో మునిగిపోయాడు. ఒడ్డున వున్న దిలీప్ వెంటనే తుమ్మపాలలో బంధువుల వద్ద వెళ్లి చెప్పాడు. వారు వచ్చి గాలించినప్పటికీ ఆచూకీ లభ్యంకాలేదు. కకాగా బుధవారం మధ్యాహ్నం నదిలో దుర్గాప్రసాద్ మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, మృతుడి భార్య సంతోషి నూకలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

## రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21:** ప్రయాణికుల ముసుగులో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం అర్ధరాత్రి ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. చెన్నైకు చెందిన శంకర్ పాండే, శర్వణ్‌పాండే, ఖాదర్ వల్లీ అనే వ్యకులు ఏజెన్సీ నుంచి మధురైకు 18 కిలోల గంజాయి తరలిస్తున్న క్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ నవీన్‌కు పట్టుబడ్డారు. అదుపులకి తీసుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.

## ఏడు ఎకరాల్లో సరుగుడు, ఆయిల్ పామ్ తోటలు దగ్ధం


దగ్ధమైన సరుగుడు తోట

**దేవరాపల్లి, ఫిబ్రవరి 21:** మండలంలోని వాలాబు శివారు విప్పగరువు వద్ద ఏడు ఎకరాల్లో సరుగుడు, ఆయిల్‌పామ్ తోటలు దగ్ధమయ్యాయి. తన రెండు ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు కాలిపోయాయని బల్జి దేముడమ్మ వాపోయింది. దుప్పి జమ్ములమ్మకు చెందిన ఐదు ఎకరాల సరుగుడు తోట కాలిపోయింది. ఇటీవల రూ.10 లక్షలకు అడిగారని, ఇంకా ఎక్కువ ధర వస్తుందన్న ఉద్దేశంతో విక్రయించలేదని చెప్పారు. కాగా ఆయిల్‌పామ్, సరుగుడు తోటలకు మంటలు ఎలా అంటుకున్నాయో తెలియదని బాధిత మహిళా రైతులు వాపోయారు.

## పాత్రికేయులపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ

» టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ మూర్తి

**విశాఖపట్నం, ఫిబ్రవరి 21:** అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కర్నూలులో ఈనాడు సంస్థల కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసన సభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ అవినీతి సొమ్ముతో సాక్షి పత్రిక నెలకొల్పారన్నారు. రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలో రానున్నదని, అప్పుడు సాక్షి సోదరులకు ఎవరు భద్రత కల్పిస్తారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత సాక్షి పత్రిక పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. వ్యక్తిగత పనిమీద శారదా పీఠానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వస్తే రోడ్డు మీద ప్రజలకు ఆంక్షలు ఏమిటని ప్రశ్నించారు. ఈవెంట్ మేనేజర్లను నియమించి ఎండలో రోడ్డుపై ప్రజలను బారులుదీరేలా నిల్చోపెట్టడం తగదని బండారు అన్నారు. ముఖ్యమంత్రి వస్తే నగరంలో కర్ఫ్యూ లాంటి వాతావరణ నెలకొంటోందని, ఇందుకు విశాఖ ప్రజలకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విశాఖకు ఎన్ని పరిశ్రమలు తీసుకు వచ్చారో చెప్పాలని కోరారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి గాలిలో ఉందని , అయనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించలేదన్నారు.

## ఏపీపీఎస్సీ పరీక్షలకు కంట్రోల్‌రూమ్: జేసీ జాహ్నవి

**అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 21:** ఈ నెల 25వ తేదీన నిర్వహించే ఏపీపీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్టు జాయింట్ కలెక్టర్ జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 08924 - 22888 నంబరుకు ఫోన్ చేసి పరీక్షలకు సంబంధించిన సమాచారం పొందవచ్చునన్నారు.

### చికెన్ ధరలు

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 125.00 |
| లైవ్ ధర | 145.00 |
| విత్ స్కిన్ | 260.00 |
| స్కిన్ లెస్ | 270.00 |

### కోడి గుడ్లు (నెక్)

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 525 |
| విజయనగరం | 529 |
| శ్రీకాకుళం | 529 |

# అడుగడుగునా గోతులు, గతుకులు

అధ్వానంగా 'నాతవరం' రహదారులు

**నాతవరం, ఫిబ్రవరి 21:**
*నాతవరం మండలంలో పలు ప్రధాన రహదారులకు ఐదేళ్ల నుంచి తరబడి నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రూపురేఖలు మారిపోయి అధ్వానంగా తయారయ్యాయి. గోతులు, గతుకులతో నిండి ఈ రహదారులపై ప్రయాణిస్తుంటే ఒళ్లుహూనం అవుతున్నదని ప్రజలు వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారిలో పలువురు వెన్నెముక సంబంధ సమస్యలతో ఆస్పత్రి పాలవుతున్నారు.*

- ఐదేళ్లుగా నిర్వహణను గాలికొదిలేసిన ప్రభుత్వం
- పలుచోట్ల పూర్తి ఛిద్రమైన తుని-నర్సీపట్నం రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ఐదు జిల్లాల ప్రయాణికులు
- ఇదే రోడ్డులో ఆర్అండ్‌బీ మంత్రి నియోజకవర్గం
- అయినా పట్టించుకోని అమాత్యులు, అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు
- వర్షాకాలం వచ్చేలోగా గోతులైనా కప్పాలని వినతి


నర్సీపట్నం-తుని మధ్య ఎ.శరభవరం వద్ద అనవాళ్లు లేని తారు రోడ్డు


అడుగడుగునా గోతులతో నిండిన గొలుగొండపేట-వెదురుపల్లి రహదారి

నాతవరం మండలం మీద నుంచి వెళుతున్న తుని-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రహదారిపై అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లి ప్రాంతాలు, అనకాపల్లి జిల్లా మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల ప్రజలు కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ రోడ్డు మీదుగానే తుని రైల్వే స్టేషన్‌కు వెళుతుంటారు. అదే విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు కూడా అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు ఈ మార్గంలోనేవచ్చిపోతుంటారు. నిరంతరం రద్దీగా వుండే ఈ రోడ్డు నిర్వహణను ఆర్అండ్‌బీ అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. పలుచోట రోడ్డు మొత్తం గోతులు ఏర్పడి తారురోడ్డు అనవాళ్లు లేకుండా పోయింది. రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రాతినిధ్యం వహిస్తున్న తుని నియోజకవర్గంలో రెండు మండలాల మీదుగా ఈ రహదారి వెళుతుంది. అయినప్పటికీ ఈ రోడ్డు దుస్థితిని ఆయన పట్టించుకోవడంలేదని ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

మండలంలో వెన్నలపాలెం (తాండవ జంక్షన్) నుంచి తాండవ జలాశయం వద్దకు వెళ్లే రహదారి అడుగడుగునా గోతులు ఏర్పడి, రాళ్లు తేలాయి. మొత్తం 14 కిలోమీటర్ల పొడవు వున్న ఈ రోడ్డులో తాండవ జంక్షన్ నుంచి నాతవరం వరకు ఆర్అండ్‌బీ పరిధిలో, నాతవరం నుంచి తాండవ డ్యామ్ వరకు ఇరిగేషన్ శాఖ పరిధిలో వుంది. ఇరు శాఖల అధికారులు నిధులు లేవంటూ ఈ రహదారి నిర్వహణను పట్టించుకోవడం మానేశారు. గతంలో రెండు పర్యాయాలు టీడీపీ, జనసేన నాయకులు వేర్వేరుగా సొంత సొమ్ముతో గోతులు కప్పించారు. వర్షాలతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో నాతవరంతోపాటు కొయ్యూరు మండలంలోని కొన్ని పంచాయతీల ప్రజలు నాతవరం, నర్సీపట్నం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో మన్యపురట్ల-ఉప్పరగూడెం మధ్య పంచాయతీరాజ్ శాఖకు చెందిన తారురోడ్డు కూడా గోతులు ఏర్పడి ఛిద్రంగా మారింది. ఈ మార్గంలో ఉప్పరగూడెం, కొత్తనాయుడుపాలెం, లింగంపేట, రాజుపేట అగ్రహారం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సులు నడపడంలేదు. దీంతో ప్రయాణికులు ఆటోలపై ఆధారపడాల్సి వస్తున్నది. గోతుల కారణంగా ప్రయాణ సమయం రెట్టింపు కావడమే కాకుండా ఆటోలు పాడైపోతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. ఇంకా గొలుగొండపేట-వెదురుపల్లి తారు రోడ్డు కూడా బాగా పాడైంది. దీంతో నర్సీపట్నం ఆర్టీసీ డిపో అధికారులు మూడేళ్ల క్రితం బస్సు సర్వీసును రద్దు చేశారు. రానున్న మూడు నెలలు వర్షాలు పడవు కాబట్టి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులను బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


సగానికిపైగా ఛిద్రమైన మన్యపురట్ల- ఉప్పరగూడెం రోడ్డు

### వర్షాకాలం వచ్చేలోగా గోతులైనా పూడ్చండి



మన్యపురట్ల నుంచి కొత్తనాయుడుపాలెం, ఉప్పరగూడెం మీదుగా తుని- నర్సీపట్నం రోడ్డులో శరభవరం జంక్షన్ వరకు ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాను. సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం వున్న ఈ రోడ్డు మొత్తం పాడైపోయింది. పలుచోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనివల్ల ఆటో విడిభాగాలు పాడై తరచూ మరమ్మతులకు గురవుతున్నది. ఆటో డ్రైవర్లతోపాటు ప్రయాణికులు కూడా ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలం వచ్చేలోపు కనీసం గోతులు అయినా పూడ్చాలని అధికారులను కోరుతున్నాను.

- కీర్తి రామకృష్ణ, ఆటో డ్రైవర్, మన్యపురట్ల

# పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డు తగదు

» జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు


జీవీఎంసీ జోన్ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతున్న నాగబాబు

**అనకాపల్లి, ఫిబ్రవరి 21:** పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డును కొనసాగించడం దారుణమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు అన్నారు. బుధవారం జీవీఎంసీ వద్ద గల డంపింగ్‌యార్డును జనసేన నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఇక్కడ ఉండడం వల్ల పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా ఉన్నాయన్నారు. చెత్త నుంచి సంపద తయారీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉందని, రాష్ట్రం సైతం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డంపింగ్ యార్డు తరలింపుపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే సమీపంలో ఉండే ప్రజలు నాగేంద్రబాబుకు వినతిపత్రాలను అందజేశారు. ప్రధానంగా డంపింగ్‌యార్డు సమస్యను సమీపంలో ఉండే ప్రజల తరపున విభిన్నప్రతిభావంతుల సంఘం నాయకుడు పాత్రపల్లి వీరుయాదవ్ నాగేంద్రబాబుకు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో సాగునీటి వనరులు ధ్వంసం


ఉమ్మలాడ వద్ద శారదా నది గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న నాగబాబు

**మునగపాక, ఫిబ్రవరి 21:** రాష్ట్రంలో సాగునీటి వనరులను వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు ఆరోపించారు. బుధవారం ఉమ్మలాడ వద్ద శారదానది గ్రోయిన్‌ను ఆయన పరిశీలించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జులు సుందరపు విజయ్‌కుమార్, పరుచూరి భాస్కరరావులు ఆయనకు గ్రోయిన్ల వ్యవస్థ గురించి వివరించారు. శారదా నదిపై దెబ్బ తిన్న గ్రోయిన్లకు వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదని తెలిపారు. గ్రోయిన్ల మరమ్మతుల కారణంగా దిగువ ఆయకట్టు సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని చెప్పారు. శారదానది గట్టును పటిష్ఠం చేయాలని రైతాంగం కోరుతున్నప్పటికీ ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. జనసేన, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ గ్రోయిన్ల వ్యవస్థను అభివృద్ధి చేస్తామని నాగబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పావాడ కామరాజు, మొల్లేటి ఆనంద్, ఆడారి శ్రీకాంత్, ఏవీ సత్యనారాయణ, కె.చంద్రమోహన్, కాశీ, పల్లెల నరసింగరావు, పవన్, వాసు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మొల్లేటి నారాయణరావు, కాండ్రేగుల సత్తిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.


ఏటికొప్పాక హస్త కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న నాగబాబు

### ఏటికొప్పాకలో నాగబాబు..

**ఎలమంచిలి, ఫిబ్రవరి 21:** ఏటికొప్పాక గ్రామంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు సందడి చేశారు. బుధవారం ఆ గ్రామానికి చేరుకుని బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని హస్తకళాకారుల కాలనీని, రాష్ట్రపతి ఆవార్డు గ్రహీత చిన్నయాచారి హస్తకళా కేంద్రాన్ని సందర్శించి కళాఖండాలను పరిశీలించారు. చిన్నయాచారి రూపొందించిన హస్త కళాఖండాలను, సూక్ష్మ కళాఖండాలను పరిశీలించి సత్కరించారు.

## ప్రశ్నించే గళం అంటే జగన్‌రెడ్డికి వణుకు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21:** ప్రశ్నించే గళం అంటే జగన్‌రెడ్డికి వణుకు పుడుతుందని, అందుకే మీడియాపై దాడులు చేయిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. వైసీపీ రౌడీ మూకలు మీడియా సంస్థలు, మీడియా ప్రతినిధులపై చేస్తున్న దాడులను ఖండిస్తూ బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లే వైసీపీ కార్యకర్తలు మీడియా ప్రతినిధులు, సంస్థలపై దాడులకు తెగబడుతున్నారని ఆయన అన్నారు. జగన్‌రెడ్డి ప్రతి సభల్లో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 మీడియా సంస్థల పేర్లు లేవనెత్తకుండా సభలు ముగించలేని దాఖలాలు లేవన్నారు. యదార్థాలు రాసే ఈ సంస్థలపై ఆయనకు అక్కసు అని బుద్ద వ్యాఖ్యానించారు. జగన్‌రెడ్డి సభల్లో చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను ఏక వచనంతో మాట్లాడుతూ వారి ఫొటోలు, ఫ్లెక్సీలు పెట్టించి చెప్పులతో తన్నించి చూడడం అతని సైకో తత్వానికి నిదర్శనమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.

## మీడియాపై దాడులను ఖండిస్తూ ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

**అనకాపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):** జర్నలిస్టులు, మీడియా సంస్థలపై వైసీపీ శ్రేణుల దాడులను ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం ధర్నా చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి, మీడియాపై దాడులను అరికట్టాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి వెంకటేశ్, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బి.కొండలరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగశ్రీను, పి.రామారావు, సీనియర్ పాత్రికేయులు బాషా, తిమ్మాపాత్రుని రమేశ్, కె. మోహనబాబు, కె.చంద్రశేఖర్, గంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ సంస్కృతికి ప్రతిబింబం...మిలాన్ గ్రామం

**విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచంలో వివిధ దేశాల సంస్కృతీ సంప్రదాయాలకు వేదికగా నిలిచే 'మిలాన్ గ్రామం'ను కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. నావల్ డాక్‌యార్డులోని సముద్రిక ఆడిటోరియం సమీపాన ఏర్పాటుచేసిన దీనిని మంత్రి బుధవారం సాయంత్రం ప్రారంభించి నేవీ కుటుంబాలకు ఆహ్వానం పలికారు. ఇక్కడ భారతీయ వంటకాలే కాకుండా మిలాన్‌లో పాల్గొంటున్న 50 దేశాలకు చెందిన వంటకాలు, వస్తువులు, దుస్తులు, సంగీత పరికరాలు ప్రదర్శనకు పెట్టారు. మిత్రుల అలవాట్లు, అభిరుచులు తెలుసుకుంటూ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించుకుంటూ స్నేహ సంబంధాలు పెంచుకోవడమే మిలాన్ లక్ష్యం కావడంతో ఈ గ్రామంలో వాటికి సంబంధించిన అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కేంద్ర మంత్రి కూడా ఆసక్తిగా అన్నింటిని తిలకించి, ఆసక్తికరమైన వాటిని అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**రక్షణ శాఖ పారిశ్రామిక ప్రదర్శన**

రక్షణ రంగంలో వస్తున్న మార్పులు, అందుబాటులో ఉన్న పరికరాలు, కొత్త ఆవిష్కరణలను వివరించే పారిశ్రామిక ప్రదర్శనను కూడా రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఎల్ అండ్ టి, భారత్ ఎలక్ట్రానిక్స్, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, డిఫెన్స్ స్టార్టప్స్, డీఆర్‌డీఓ, తదితర సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు పెట్టాయి. ఇది మూడు రోజులు ఉంటుంది. ఈ ప్రదర్శనలో ఉంచిన ఒక కొత్త తుపాకీని రక్షణ శాఖా మంత్రి ఆసక్తిగా తిలకించి, దాని గురించి అడిగి తెలుసుకొని, లక్ష్యానికి గురిపెట్టి పనితీరు పరీక్షించారు.

## మాఘ పౌర్ణమి జాతరకు 35 ప్రత్యేక బస్సులు

» నర్సీపట్నం డిపో మేనేజర్ ఎమ్ఎస్ఎస్ ధీరజ్

**నర్సీపట్నం, ఫిబ్రవరి 21:** మండలంలోని రేవు పోలవరం సముద్రతీరం వద్ద ఈ నెల 24న జరిగే మాఘ పౌర్ణమి జాతరకు నర్సీపట్నం డిపో నుంచి మొత్తం 35 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు బుధవారం నర్సీపట్నం డిపో మేనేజర్ ఎమ్ఎస్ఎస్ ధీరజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచి 24వ తేదీ సాయంత్రం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. నర్సీపట్నం నుంచి రేవుపోలవరం గ్రామానికి పది బస్సులు, అడ్డరోడ్డు నుంచి రేవు పోలవరానికి ఇరవై, కొడవటిపూడి నుంచి రేవుపోలవరానికి రెండు, అలాగే కర్రివానిపాలెం నుంచి రేవుపోలవరానికి మూడు బస్సులు నడుపుతామని చెప్పారు.

### అనకాపల్లి డిపో నుంచి పూడిమడకకు 35 ప్రత్యేక బస్సులు

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21:** మాఘపౌర్ణమి జాతర సందర్భంగా పూడిమడకకు ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచి 24వ తేదీ సాయంత్రం వరకు అనకాపల్లి డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారిణి కె. పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎలమంచిలిలో జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు

**ఎలమంచిలి, ఫిబ్రవరి 21:** అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఫలితాలను బుధవారం జిల్లా సెక్రటరీ కొరారు నరేష్ ప్రకటించారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ఆడారి వీరునాయుడు, ప్రధాన కార్యదర్శిగా కొరారు నరేష్, ఉపాధ్యక్షులుగా ఏబీఎల్ రాజు, రాంబాబు, కల్పన, జాయింట్ సెక్రటరీలుగా కృష్ణవేణి, యమున, రమేశ్, తేజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఎన్నికల పరిశీలకుడిగా రవిరాజు వ్యవహరించినట్టు చెప్పారు.

## జి.కొత్తపల్లిలో జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు


పోటీల్లో పరుగులు తీస్తున్న ఎద్దులు

**చీడికాడ, ఫిబ్రవరి 21:** మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు 15 జతల ఎడ్లతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. పరవాడ నాయుడుబాబు (అర్జునగిరి) ఎద్దులు మొదటి స్థానంలో, మజ్జి దేవానందం (చుక్కపల్లి) ఎద్దులు రెండో స్థానంలో , ఆంజనేయస్వామి (కేజేపురం) ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందించారు.

# అనకాపల్లి
## నియోజకవర్గం

### ఘనంగా మాతృభాషా దినోత్సవం

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21 :** పట్టణంలోని డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, రాంకీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష పరిరక్షణ సమితి వ్యవస్థాక అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ తెలుగుభాషను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు మహిళా హక్కుల పరిరక్షణ సభ

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21 :** మహిళా హక్కుల పరిరక్షణకు గురువారం విశాఖలో నిర్వహించనున్న బహిరంగసభను అంతా విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డీడీ వరలక్ష్మి కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. తొలుత సరస్వతిపార్కు నుంచి సెంట్రల్ పార్కు వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మాజీ, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### 'బీసీలకు సీఎం జగన్‌రెడ్డి మోసం'

**తుమ్మపాల, ఫిబ్రవరి 21 :** రాష్ట్రంలో బీసీలను ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి దగా చేస్తున్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి గుడాల సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీసీలంతా ఐకమత్యమై జగన్‌రెడ్డిని గద్దె దించేందుకు సిద్ధం కావాలన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చి బీసీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు సబ్బి శ్రీనివాసరావు, పెదపాటి కళ్యాణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### సీపీఎం నేతల ముందుస్తు అరెస్టు దారుణం

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21 :** సీఎం జగన్ విశాఖపట్నం శారదాపీఠానికి యాగం చేసేందుకు వస్తున్న సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, జిల్లా కార్యవర్గసభ్యుడు జగన్‌లను ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు.

# అర్హులందరికీ ఓటు హక్కు

▸▸ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జేసీ జాహ్నవి

**అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 :** జిల్లాలో ఇంకా మిగిలి ఉంటే అటువంటి అర్హులకు కూడా ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్టు జేసీ ఎం.జాహ్నవి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనర్హుల ఓట్ల తొలగింపునకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈవీఎంలలో ఓటింగ్ వేయడంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారితో పాటు యువ ఓటర్లకు కళాశాలల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితా తయారీలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

## నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.. : పీలా

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21 :** నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ హయాంలలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని, వైసీపీ నాయకులు చర్చకు రాగలరా.. అని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సవాల్ విసిరారు. బుధవారం గవరపాలెం పరమేశ్వరి పార్కు వద్ద నిచి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్ర అభివృద్ధి జరిగితే, జగన్‌రెడ్డి హయాంలో విధ్వంసం జరిగిందని ఎద్దేవా చేశారు. పేదల టిడ్కో గృహాలను మంత్రి అమర్‌నాథ్ అమ్ముకున్నారని ఆరోపించారు.


పరమేశ్వరిపార్కు వద్ద సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్నపీలా

## టీడీపీలో జోష్!

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే ఎందుకని ప్రశ్నించారు. మైనింగ్ కంపెనీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని, ఉద్యోగుల బదిలీలు, పోస్టింగుల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

**దేవుడి పేరు పెట్టుకుని దోపిడీ!**

నర్సీపట్నంలోని బలిఘట్టం సభలో లోకేశ్ మాట్లాడుతూ, టీడీపీ హయాంలో నర్సీపట్నం అభివృద్ధికి రూ.2 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. దేవుడిపేరు పెట్టుకున్న ఇక్కడి ఎమ్మెల్యే.. ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని గణేశ్‌ను ఉద్దేశించి ఆరోపించారు. ఇసుక, లేటరైట్ అక్రమ మైనింగ్ ద్వారా రూ.150 కోట్లు సంపాదించారని విమర్శించారు.

**అభివృద్ధి నిల్... అవినీతి ఫుల్**

మాడుగుల నియోజకవర్గం సురవరంలో జరిగిన శంఖారావం సభలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అవినీతి, అరాచకాలకు పాల్పడుతున్నారని లోకేశ్ ఎండగట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ జిల్లాలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. అభివృద్ధి నిల్.. అవినీతి మాత్రం ఫుల్ అన్న తీరులో పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రోడ్లు బాగు చేయించడం చేతకాని మంత్రికి.. గ్రానైట్ వ్యాపారుల నుంచి నెలకు కోటి రూపాయల చొప్పున మామూళ్లు వసూలు చేయడం మాత్రం బాగా తెలుసని ఎద్దేవా చేశారు.

**అక్కడి చెత్త.. ఇక్కడ బంగారం అవుతుందా?**

కోటవురట్లలో జరిగిన సభలో ప్రస్తుత ఎమ్మెల్యే, కొత్త సమన్వయకర్తలపై లోకేశ్ విమర్శల బాణాలు సంధించారు. ఐదేళ్ల నుంచి ఇక్కడ ఎమ్మెల్యేగా వున్న వ్యక్తి నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయించలేకపోయారని అన్నారు. ఇక రాజాం నుంచి చెత్తను తీసుకువచ్చి పాయకరావుపేటలో పెడితే పసిడి అవు తుందా? ఈ నియోజకవర్గంలో ఏ ప్రాజెక్టు ఎక్కడ ఉందో ఆయనకు తెలియదు అని వైసీపీ కొత్త సమన్వయకర్త కం బాల జోగులును ఉద్దేశించి విమర్శించారు. టీడీపీ హయాంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపడితే, వైసీపీ హయాంలో అభివృద్ధి పడకేసిందని ఆరోపించారు. తాండవ షుగర్ ఫ్యాక్టరీ మూసివేత, టీటీడీ నుంచి ఉపమాక ఆలయానికి నిధులు మంజూరు చేయించలేకపోవడం వంటి వైఫల్యాలను ఎత్తిచూపారు.

## 'మలసాల కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీయే'

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21 :** మలసాల కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీయేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ అన్నారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన కాపల్లి నియోజకవర్గానికి మలసాల భరత్ రాజకీయ టూరిస్టుగా వచ్చారన్నారు. కనీసం అనకాపల్లి సరిహద్దులు కూడా తెలియని వ్యక్తి భరత్ అని విమర్శించారు. అనకాపల్లి నియో జకవర్గాన్ని టీడీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశారన్నారు. ఇక వైసీపీ పాలనలో అభివృద్ధి మాట అటుంచితే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.500 కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ మూసేసి రైతులను దగా చేశారన్నారు.

మంత్రి అమర్‌నాథ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే ఇక్కడ సీటు ఇవ్వకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. ఒకవేళ పోటీ చేసినా అతనిని తరిమికొట్టేందుకు నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంపై ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతికి మాటలు చెప్పడం తప్ప పనులను చేసి చూపించే సత్తా లేదన్నారు. అనకాపల్లి నియోజకవర్గం అభివృద్ధిపై బహిరంగ చర్చకు టీడీపీ సిద్ధమని స్పష్టం చేశారు. పక్కా సాక్ష్యాధారాలతో నెహ్రూచౌక్‌లో చర్చించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని వైకాపా నాయకులకు దమ్ముంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నారిపిన్ని చంద్రశేఖర్, కర్రి బాబి, తలారి కాశీనాయుడు, శెట్టి వెంకటరమణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, మదుపాడ నరసింగరావు, మెయ్య నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెందుర్తి
## నియోజకవర్గం

### నేడు కలపాకలో దుర్గామాంబ పండగ



**పరవాడ, ఫిబ్రవరి 21 :** మండలంలోని కలపాకలో దుర్గామాంబ అమ్మవారి పండగను గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. పరవాడ సీఐ బాల సూర్యారావు పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### 27న రామచంద్రమ్మ జాతర

**పరవాడ, ఫిబ్రవరి 21 :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వాడచీపురుపల్లి రామచంద్రమ్మ జాతర ఈ నెల 27న జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కూండ్రపు శ్రీనివాసరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, రమణమూర్తి, కూండ్రపు అప్పలనాయుడు, బూస అప్పలరాజు, కూండ్రపు తాతాజీ పాల్గొన్నారు.

### విద్యుత్‌కు అంతరాయం రేపు

**సబ్బవరం, బుధవారం 21 :** సబ్బవరం, అంతకాపల్లి 11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల పనుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

### ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ పై దాడి అమానుషం


జూనియర్ అసిస్టెంట్‌కు వినతిని అందిస్తున్న జర్నలిస్టులు

**పరవాడ, ఫిబ్రవరి 21 :** రాప్తాడులో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభను కవరేజ్ చేసేందుకు వెళ్లిన అనంతపురం 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అమానుషమని ఏపీడబ్ల్యూజే పరవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పైలా సన్యాసిరావు ధ్వజమెత్తారు. ఫొటోగ్రాఫర్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ పార్టీలపై ఉన్న కక్షపూరిత వైఖరిని పాత్రికేయులపై చూపించడం సరికాదన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు గణేష్, కె.సన్యాసినాయుడు, డి.మహేష్, బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి X ఎమ్మెల్యే

... 5వ పేజీ తరువాయి

విలువ చేసే గ్రావెల్ టెండర్‌ను మంత్రి అమర్ వర్గానికి చెందిన అచ్యుతాపురం మండలం దొప్పెర్ల పంచాయతీ సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు సోదరుడు సరోజారావు (శ్రావణి గ్రూప్) దక్కించుకున్నారు. ఈ నెల 16వ తేదీన పనులు ప్రారంభించగా ఎమ్మెల్యే వర్గీయులు వచ్చి అడ్డుకున్నారు. తాము ఎస్ఈజడ్ నిర్వాసితులమని, తాము ఇచ్చిన భూముల్లో విద్యుత్ ఉపకేంద్రం నిర్మిస్తున్నందున భూమి చదును పనుల కాంట్రాక్టు తమకే ఇవ్వాలని పట్టుబట్టారు. కానీ తాము టెండర్ ద్వారా దక్కించుకున్నామని, తాము కూడా సెజ్ నిర్వాసితులమేనని, 'బార్క్'కు కేటాయించిన భూముల్లో తమవి కూడా ఉన్నాయని చిన్నారావు, అతని సోదరుడు వాదించారు. ఈ సందర్భంగా సెజ్ కర్మాగార నిర్మాణ పనుల్లో ఎవరెంత దందా సాగించారో ఇరువర్గాల వారు బయటపెట్టుకున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ భూమి చదును పనులు చేయనిచ్చేది లేదని ఎమ్మెల్యే వర్గీయులు భీష్మించుకోవడంతో టెండర్ పొందిన చిన్నారావు సోదరులు పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం పనులు మొదలుపెడతామని వీరు చెబుతుండగా, ఎలా చేపడతారో చూస్తామని ఎమ్మెల్యే వర్గీయులు అంటున్నారు. దీంతో పోలీసుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా తయారైంది.

**అభిజిత్ ఫ్లై యాష్ విషయంలోనూ ఇదే తీరు!**

అభిజిత్ ఫెర్రో కర్మాగారం వ్యర్థాల విషయంలో కూడా గతంలో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఈ ఫ్యాక్టరీలో ఉత్పత్తి సందర్భంగా ఫ్లై యాష్ (బూడిద) వ్యర్థాలు వచ్చేవి. దీనిని నిల్వ చేయడానికి చాలా స్థలం అవసరం అయ్యేది. ఫ్లై యాష్‌ను వదిలించుకోవడానికి ఇటుకల (ఫాల్ జీ బ్రిక్స్) తయారీదారులకు ఉచితంగా ఇస్తామని యాజమాన్యం ప్రకటించింది. అంతేకాక టన్నుకు రూ.20 చొప్పున రవాణా చార్జీలు కూడా ఇస్తామని చెప్పింది. దీంతో ఫాల్ జీ బ్రిక్స్ తయారీదారులు తీసుకెళ్లడం మొదలుపెట్టారు. రోజు వంద లారీలకు తక్కువ లేకుండా ఫ్లై యాష్ రవాణా అయ్యేది. క్రమేపీ డిమాండ్ పెరగడంతో కంపెనీ యాజమాన్యం టన్ను రూ.150కి విక్రయించడం ప్రారంభించింది. ఈ విషయం పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్ వర్గీయులకు తెలియడంతో అభిజిత్ కర్మాగారం యాజమాన్యాన్ని కలిశారు. ఫ్లై యాష్‌ను గంప గుత్తంగా తీసేసుకుని, టన్ను రూ.300కు విక్రయించడం మొదలుపెట్టారు. అంటే ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా టన్నుకు రూ.150 చొప్పున రోజుకు రూ.2-3 లక్షలు జేబులో వేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు వర్గీయులు.. ఫ్లై యాష్ రవాణాను అడ్డుకున్నారు. తరువాత ఇరువర్గాల వారు రాజీపడి ఒక అంగీకారానికి వచ్చారు. ఫ్లై యాష్ ఆదాయాన్ని పంచుకుంటున్నారు.

**నిర్వాసితుల పేరుతో నాయకులు దందా**

ప్రత్యేక ఆర్థిక మండలి నిర్వాసితుల పేరుతో కొంతమంది నాయకులు దందా సాగిస్తున్నారు. కర్మాగారాల్లో లేబర్, వర్క్ కాంట్రాక్టర్లను బెదిరించి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. నాయకుల్లో కొంతమందికి సరకు రవాణా వాహనాలు వున్నాయి. ఏ కాంట్రాక్టర్ అయినా తమ వాహనాలే వాడాలని, చెప్పినంత కిరాయి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎలమంచిలి
## నియోజకవర్గం

### నేడు శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

**మునగపాక, ఫిబ్రవరి 21:** మండల కేంద్రంలోని సంతబయలు శ్రీకృష్ణుని ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మళ్ల జయలక్ష్మి మాట్లాడుతూ 16 మంది పిల్లలు శ్రీకృష్ణ బాలల యువజన సంఘాన్ని స్థాపించి, వారు పెద్దయ్యాక యువజన సంఘంగా ఎదిగి ప్రజల సహకారంతో ఆలయాన్ని నిర్మించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు పీఎస్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### గీత కార్మికులకు పరిహారం చెల్లించాలి

**అచ్యుతాపురం, ఫిబ్రవరి 21:** సెజ్ పరిధిలోని గీత కార్మికులకు పరిహారం చెల్లించాలని యాత, శెట్టిబలిజ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందించినట్టు చెప్పారు. జీవో 68 ప్రకారం ప్యాకేజీ ఇప్పిస్తేనే వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం స్థాయిలో పార్టీకి అండగా ఉంటామని మంత్రికి చెప్పామన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు పి.వెంకటరమణ, ఏపీ యాత కార్పొరేషన్ చైర్మన్ నూకరాజు, ఎస్ఈజెడ్ కాలనీ కార్మిక సంఘ నేతలు పి.కొండలరావు, కె.తాతబాబు, బి.నరసింగరావు ఉన్నారు.

### రాంబిల్లి హైస్కూల్ డ్రోన్ వర్కుషాప్

**రాంబిల్లి, ఫిబ్రవరి 21:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం టెక్కీబోట్ సొల్యూషన్ ఆధ్వర్యంలో అటల్ ల్యాబ్ డ్రోన్ వర్కుషాప్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్‌లో నైపుణ్యం పెంచుకోవడానికి విద్యార్థులకు ఈ శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం వేణుగోపాల్, స్కూల్ కమిటీ చైర్మన్ వర్మరాజు పాల్గొన్నారు.





ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన వంతెన

### నేడు ఎలమంచిలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

**ఎలమంచిలి, ఫిబ్రవరి 21:** పట్టణంలోని కొక్కిరాపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి 13 ఏళ్ల తరువాత ఎట్టకేలకు గురువారం ప్రారంభం కానుంది. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు, ఎమ్మెల్యే కన్నబాబురాజు చేతుల మీదుగా ఈ బ్రిడ్జిని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 2009లో ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.35 కోట్ల వ్యయంతో అప్పటి మంత్రి కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా శిలాఫలకం ఆవిష్కరించారు. అప్పట్నుంచి బ్రిడ్జి పనులు కొనసా...గుతూనే ఉన్నాయి. ఎట్టకేలకు ఎన్నికల దృష్ట్యా ఈ బ్రిడ్జిని వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావడం విశేషం.

### విలేకరులపై రాజకీయ విద్వేషాలు దుర్మార్గం

▸▸ ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు


డీటీ కుమారస్వామికి వినతిపత్రం అందిస్తున్న విలేకరులు

**అచ్యుతాపురం, ఫిబ్రవరి 21:** విలేకరులపై రాజకీయ విద్వేషాలు చూపడం దుర్మార్గమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ శ్రీనివాసరావు అన్నారు. విలేకరులపై దాడులకు నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాస్తవ వార్తలు ప్రచురిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి తప్పితే విలేకరులు, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం తగదన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధుల్లా పనిచేస్తున్న విలేకరులపై దాడులు సమర్థనీయం కాదన్నారు. దీన్ని అంతా ఖండించాలని ఆయన కోరారు. అనంతరం డీటీ కుమారస్వామికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నాయుడు, నరేష్, డి.అప్పలనాయుడు, జి.రామకృష్ణ, మంగరాజు, భాను పాల్గొన్నారు.

### తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షునిపై దాడి సిగ్గుచేటు

**మునగపాక, ఫిబ్రవరి 21:** తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై దాడి చేయడం సిగ్గుచేటని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి డి.మునిసిలినాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై నిరంతరం శ్రీనివాసరెడ్డి చేస్తున్న పోరాటం తట్టుకోలేక దాడి చేశారన్నారు. రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడంతో తట్టుకోలేని వైసీపీ మూకలు ఆయనపై దాడికి దిగాయన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా కార్యదర్శి ఎంపీ నరసింగరావు, మండల నేత ఎ.గోవింద పాల్గొన్నారు.

### ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ గ్రామసభ

**రాంబిల్లి, ఫిబ్రవరి 21:** మండలంలోని దిమిలి పంచాయతీలో ఉపాధి పనులకు సంబంధించి బుధవారం సోషల్ ఆడిట్ గ్రామసభను నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు 2022-2023 సంవత్సరంలో జరిగిన పనులపై ఆడిట్ చేసినట్టు డీఆర్పీ యు.శ్రీనివాసరావు తెలిపారు. పలు రూ.72.59 లక్షల వేతనాలు సొమ్ముతో పాటు రూ.11,100 మెటీరియల్ ఖర్చుపై ఆడిట్ చేశామన్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి రూ.3.65 లక్షల పనులపై ఆడిట్ చేశామన్నారు. ఉప సర్పంచ్ ఎన్.మురళీకృష్ణ, ఈసీ రాఘవేంద్రకుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## జిల్లాలో వేగవంతంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు

▸▸ జిల్లా రిజిస్ట్రార్ జానకిదేవి

**కోటవురట్ల, ఫిబ్రవరి 21:** అనకాపల్లి జిల్లా పరిధిలోని జగనన్న కాలనీల ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని జిల్లా రిజిస్ట్రార్ జానకిదేవి తెలిపారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో 86 వేల రిజిస్ట్రేషన్‌లు చేయాల్సి ఉండగా, ఇప్పటికే 60 వేలు పూర్తయ్యాయన్నారు. గ్రామస్థాయిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేయడం వల్ల ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు జిల్లాల్లో పది రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా, వాటిలో ఐదు కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. మిగతా ఐదు కార్యాలయలుఉ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక రిజిస్ట్రార్ మూర్తి పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ జానకి

### ఉద్యోగుల పనితీరు మెరుగుపర్చుకోవాలి: డీఎల్‌డీవో ఉదయశ్రీ

**పాయకరావుపేట, ఫిబ్రవరి 21:** గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని డీఎల్‌డీవో ఎం.ఉదయశ్రీ సూచించారు. పాయకరావుపేటలో వార్డు సచివాలయాలను బుధవారం సందర్శించిన ఆమె రికార్డులు పరిశీలించారు. కులగణన సర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల యాప్ డౌన్‌లోడ్ తదితర పనుల్లో సచివాలయాల ఉద్యోగులు వెనుకబడి ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని పలు సచివాలయాల్లో రికార్డుల అప్‌లోడ్, మెయింటెనెన్స్ సక్రమంగా లేదన్నారు. తన పరిధిలో ఉన్న 12 మండలాల్లో అన్నిటి కంటే పాయకరావుపేట మండలంలోని సచివాలయాలు కులగణన సర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల యాప్ డౌన్‌లోడ్ తదితర అంశాల్లో పనితీరులో వెనుకబడి ఉన్నారన్నారు. ఇప్పటికైనా తీరు మెరుగుపర్చుకోవాలని ఆమె హెచ్చరించారు.

### ఎన్ఏఓబీ నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించండి: లోకనాథం

**అచ్యుతాపురం, ఫిబ్రవరి 21:** రాంబిల్లి మండలంలో ఎన్ఏఓబీ నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎన్ఏఓబీ ల్యాండ్ ఎక్విజేషన్ ఎస్‌డీసీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. చెట్లు కోల్పోయిన రైతులకు పరిహారం ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆర్.దేముళ్లు, సూరిబాబు, రొంగలి రాము, రావి మంగ పాల్గొన్నారు.

## అమ్మఒడి, ఆసరా డబ్బు తినడమే కాదు..

... 5వ పేజీ తరువాయి

శారదా పీఠానికి చేరుకునేంత వరకూ దారిపొడవునా మహిళలను నిలబెట్టి ప్లకార్డులతో స్వాగతం పలకడం ద్వారా ఆయన మెప్పు పొందాలని భావించారు. దీనికోసం జీవీఎంసీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను తరలించాలని యూసీడీ అధికారులను ఆదేశించారు. ఒక్కో ఆర్పీ తన పరిధిలోని గ్రూపుల నుంచి కనీసం వంద మందిని తీసుకురావాలని టార్గెట్ విధించారు. దీంతో ఆర్పీలంతా సీఎంకు స్వాగతం పలికేందుకు తప్పనిసరిగా రావాల్సిందేనని తమ పరిధిలోని మహిళా సంఘాల గ్రూపుల్లో వాయిస్ మెసేజ్‌లు పెట్టారు. దీంతో సభ్యులంతా తప్పదన్నట్టు ఉదయాన్నే ఎనిమిదిన్నరకు తమ ఇళ్ల వద్దకు వచ్చిన ఆటోలు ఎక్కి బయలుదేరారు.

షెడ్యూల్ ప్రకారం సీఎం జగన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని రోడ్డు మార్గంలో శారదా పీఠానికి వెళ్లాలి. అందుకే ఉదయం తొమ్మిది గంటలకే మహిళలను సంబంధిత ఆర్పీలు, ఏపీడీలు తమకు కేటాయించిన ప్రాంతానికి తీసుకువెళ్లి రోడ్డుపక్కన నిలబెట్టారు. అయితే సీఎం ఎయిర్‌పోర్టులో దిగిన తర్వాత గంట ఆలస్యంగా అక్కడ నుంచి బయలుదేరారు. అప్పటికే గంటల తరబడి ఎండలో నిలబడిన మహిళలు ఎండ తీవ్రతకు ఇబ్బందిపడ్డారు. తమ చేతిలో ఉన్న ప్లకార్డులను అడ్డంపెట్టుకుని ఫుట్‌పాత్‌లపైనే కూర్చుండిపోయారు. మరికొందరు సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి ఎండ నుంచి సేదతీరారు. యూసీడీ సిబ్బంది మహిళా సంఘాల సభ్యుల వివరాలతో కూడిన జాబితాను చేతిలో పట్టుకుని మరీ వచ్చినవారి హాజరు తీసుకోవడం కనిపించింది. గ్రూపుల వారీగా ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. మహిళలను సమీకరించడంతోపాటు వచ్చినవారు తిరిగి వెనక్కి వెళ్లిపోకుండా ఆపేందుకు వీలుగా ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో ఏపీడీ, పీడీతోపాటు జోనల్ కమిషనర్లుకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

ఇదిలావుంటే సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలు మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో అధికారుల తీరును తూర్పారబట్టారు. సీఎం వస్తే పార్టీ కార్యకర్తలను తీసుకువెళ్లాలిగానీ, ప్రతిసారీ తమనే రావాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని గోపాలపట్నం జంక్షన్‌లో నిలబడిన ఒక మహిళ నిలదీశారు. మహిళలకు సంబంధించిన కార్యక్రమాలకు తమను పిలిస్తే ఇబ్బందిలేదు గానీ, ఆటల పోటీల ముగింపునకు, ఇతరత్రా కార్యక్రమాలకు సీఎం వస్తున్నారని ప్రతిసారీ తమనే తరలించడం వల్ల కుటుంబపరంగా ఇబ్బందులు పడుతున్నామని బాజీ జంక్షన్‌లో నిలబడిన మహిళలు కొందరు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారని, వస్తే ఇంట్లో పనులు ఆగిపోతున్నాయని మరికొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

# పాయకరావుపేట
## నియోజకవర్గం

### గురుకులంలో జిల్లా కోఆర్డినేటర్ తనిఖీలు

**నక్కపల్లి, ఫిబ్రవరి 21:** స్థానిక బాలికల గురుకుల పాఠశాలను బుధవారం మధ్యాహ్నం జిల్లా గురుకులాల కోఆర్డినేటర్ రూపవతి తనిఖీ చేశారు. బాలికలకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని పిల్లలను అడిగారు. టెన్త్ విద్యార్థినులతో మాట్లాడుతూ మరో 20 రోజుల్లో పరీక్షలు ప్రారంభమవుతాయని, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ సువర్ణ రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మత్స్యకారుల మండిపాటు

**నక్కపల్లి, ఫిబ్రవరి 21:** మత్స్యకార జాతిని ఉద్దేశించి అమానుషంగా మాట్లాడిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మత్స్యకార సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పెదతీనార్ల ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, ఏపీ మత్స్యకార జేఏసీ సంఘం అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య, సంఘ ప్రతినిధులు అర్జిల్లి శ్రీను, అప్పలరాజు, వెంకటేశ్, చింతకాయల శ్రీనివాస్, పిక్కి నూకనాథం విలేకర్లతో మాట్లాడారు. మత్స్యకారులనుద్దేశించి ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే మత్స్యకారుల తడాఖా చూపిస్తామని వారు హెచ్చరించారు.

### నాలుగు గంటలు పవర్ కట్ రేపు

**పాయకరావుపేట, ఫిబ్రవరి 21:** చక్కానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల వార్షిక నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం నాలుగు గంటలపాటు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దొరనగర్, మండలంలోని పీఎల్.పురం, సీతారాంపురం, నామవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### కైలాసపట్నంలో 30 మద్యం సీసాల పట్టివేత

**కోటవురట్ల, ఫిబ్రవరి 21:** మండలంలోని కైలాసపట్నం మర్రిచెట్టు జంక్షన్ వద్ద బైక్‌పై తరలిస్తున్న 30 మద్యం సీసాలను పట్టుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కోటవురట్ల శివారు రాట్నాలపాలెం గ్రామానికి చెందిన బత్తుల అప్పారావు బైక్‌ను ఆపి పరిశీలించగా మద్యం సీసాలు లభించాయని చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అప్పారావుపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఎక్కడ అమ్మకాలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రజలను ఆయన కోరారు.

### వైభవంగా పాండురంగస్వామి పుష్పయాగం

**పాయకరావుపేట, ఫిబ్రవరి 21:** పాండురంగస్వామి దేవస్థానంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు యు.కృష్ణస్వామి ఆధ్వర్యంలో పాండురంగస్వామి, అమ్మవార్లను వివిధ పుష్పాలతో అలంకరించి అర్చనలు విశేష పూజలు చేశారు. అంతకుముందు ధ్వజారోహణ నిర్వహించి గరుడ అళ్వార్‌కు నివేదన ఇచ్చిన గరుడ పొంగలిని సంతానంలేని దంపతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.వెంకటాద్రి, అర్చకులు యు.నారాయణాచార్యులు, సిబ్బంది సత్తిబాబు తదితరులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### గుడివాడలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

**ఎస్ రాయవరం:** గుడివాడ గ్రామంలో వెంకటేశ్వరస్వామి వారి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

## టీడీపీలో జోష్!

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే ఎందుకని ప్రశ్నించారు. మైనింగ్ కంపెనీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని, ఉద్యోగుల బదిలీలు, పోస్టింగుల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

### దేవుడి పేరు పెట్టుకుని దోపిడీ!

నర్సీపట్నంలోని బలిఘట్టం సభలో లోకేశ్ మాట్లాడుతూ, టీడీపీ హయాంలో నర్సీపట్నం అభివృద్ధికి రూ.2 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. దేవుడిపేరు పెట్టుకున్న ఇక్కడి ఎమ్మెల్యే.. ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని గణేశ్‌ను ఉద్దేశించి ఆరోపించారు. ఇసుక, లేటరైట్ అక్రమ మైనింగ్ ద్వారా రూ.150 కోట్లు సంపాదించారని విమర్శించారు.

### అభివృద్ధి నిల్... అవినీతి ఫుల్

మాడుగుల నియోజకవర్గం సురవరంలో జరిగిన శంఖారావం సభలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అవినీతి, అరాచకాలకు పాల్పడుతున్నారని లోకేశ్ ఎండగట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ జిల్లాలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. అభివృద్ధి నిల్... అవినీతి మాత్రం ఫుల్ అన్న తీరులో పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రోడ్లు బాగు చేయించడం చేతకాని మంత్రికి.. గ్రానైట్ వ్యాపారుల నుంచి నెలకు కోటి రూపాయల చొప్పున మామూళ్లు వసూలు చేయడం మాత్రం బాగా తెలుసని ఎద్దేవా చేశారు.

### అక్కడి చెత్త.. ఇక్కడ బంగారం అవుతుందా?

పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్లలో జరిగిన సభలో ప్రస్తుత ఎమ్మెల్యే, కొత్త సమన్వయకర్తలపై లోకేశ్ విమర్శల బాణాలు సంధించారు. ఐదేళ్ల నుంచి ఇక్కడ ఎమ్మెల్యేగా వున్న వ్యక్తి నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయించలేకపోయారని అన్నారు. ఇక రాజాం నుంచి చెత్తను తీసుకువచ్చి పాయకరావుపేటలో పెడితే పసిడి అవుతుందా? ఈ నియోజకవర్గంలో ఏ ప్రాజెక్టు ఎక్కడో ఉందో ఆయనకు తెలియదు అని వైసీపీ కొత్త సమన్వయకర్త కంబాల జోగులును ఉద్దేశించి విమర్శించారు. టీడీపీ హయాంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపడితే, వైసీపీ హయాంలో అభివృద్ధి పడకేసిందని ఆరోపించారు. తాండవ షుగర్ ఫ్యాక్టరీ మూసివేత, టీటీడీ నుంచి ఉపమాక ఆలయానికి నిధులు మంజూరు చేయించలేకపోవడం వంటి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు.

## అమ్మఒడి, ఆసరా డబ్బు తినడమే కాదు...

... 5వ పేజీ తరువాయి

శారదా పీఠానికి చేరుకునేంత వరకూ దారిపొడవునా మహిళలను నిలబెట్టి ప్లకార్డులతో స్వాగతం పలకడం ద్వారా ఆయన మెప్పు పొందాలని భావించారు. దీనికోసం జీవీఎంసీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను తరలించాలని యూసీడీ అధికారులను ఆదేశించారు. ఒక్కో ఆర్పీ తన పరిధిలోని గ్రూపుల నుంచి కనీసం వందమందిని తీసుకురావాలని టార్గెట్ విధించారు. దీంతో ఆర్పీలంతా సీఎంకు స్వాగతం పలికేందుకు తప్పనిసరిగా రావాల్సిందేనని తమ పరిధిలోని మహిళా సంఘాల గ్రూపుల్లో వాయిస్ మెసేజ్‌లు పెట్టారు. దీంతో సభ్యులంతా తప్పదన్నట్టు ఉదయాన్నే ఎనిమిదిన్నరకు తమ ఇళ్ల వద్దకు వచ్చిన ఆటోలు ఎక్కి బయలుదేరారు.

షెడ్యూల్ ప్రకారం సీఎం జగన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని రోడ్డు మార్గంలో శారదా పీఠానికి వెళ్లాలి. అందుకే ఉదయం తొమ్మిది గంటలకే మహిళలను సంబంధిత ఆర్పీలు, ఏపీడీలు తమకు కేటాయించిన ప్రాంతానికి తీసుకువెళ్లి రోడ్డుపక్కన నిలబెట్టారు. అయితే సీఎం ఎయిర్‌పోర్టులో దిగిన తర్వాత గంట ఆలస్యంగా అక్కడ నుంచి బయలుదేరారు. అప్పటికే గంటల తరబడి ఎండలో నిలబడిన మహిళలు ఎండ తీవ్రతకు ఇబ్బందిపడ్డారు. తమ చేతిలో ఉన్న ప్లకార్డులను అడ్డంపెట్టుకుని ఫుట్‌పాత్‌లపైనే కూర్చుండిపోయారు. మరికొందరు సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి ఎండ నుంచి సేదతీరారు. యూసీడీ సిబ్బంది మహిళా సంఘాల సభ్యుల వివరాలతో కూడిన జాబితాను చేతిలో పట్టుకుని మరీ వచ్చినవారి హాజరు తీసుకోవడం కనిపించింది. గ్రూపుల వారీగా ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. మహిళలను సమీకరించడంతోపాటు వచ్చినవారు తిరిగి వెనక్కి వెళ్లిపోకుండా ఆపేందుకు వీలుగా ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో ఏపీడీ, పీడీతోపాటు జోనల్ కమిషనర్లుకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

ఇదిలావుంటే సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలు మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో అధికారుల తీరును తూర్పారబట్టారు. సీఎం వస్తే పార్టీ కార్యకర్తలను తీసుకువెళ్లాలిగానీ, ప్రతిసారీ తమనే రావాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని గోపాలపట్నం జంక్షన్‌లో నిలబడిన ఒక మహిళ నిలదీశారు. మహిళలకు సంబంధించిన కార్యక్రమాలకు తమను పిలిస్తే ఇబ్బందిలేదు గానీ, ఆటల పోటీల ముగింపునకు, ఇతరత్రా కార్యక్రమాలకు సీఎం వస్తున్నారని ప్రతిసారీ తమనే తరలించడం వల్ల కుటుంబపరంగా ఇబ్బందులు పడుతున్నామని బాజీ జంక్షన్‌లో నిలబడిన మహిళలు కొందరు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారని, వస్తే ఇంట్లో పనులు ఆగిపోతున్నాయని మరికొందరు మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

## మంత్రి x ఎమ్మెల్యే

... 5వ పేజీ తరువాయి

విలువ చేసే గ్రావెల్ టెండర్‌ను మంత్రి అమర్ వర్గానికి చెందిన అచ్యుతాపురం మండలం దొప్పెర్ల పంచాయతీ సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు సోదరుడు సరోజారావు (శ్రావణి గ్రూప్) దక్కించుకున్నారు. ఈ నెల 16వ తేదీన పనులు ప్రారంభించగా ఎమ్మెల్యే వర్గీయులు వచ్చి అడ్డుకున్నారు. తాము ఎస్ఈజెడ్ నిర్వాసితులమని, తాము ఇచ్చిన భూముల్లో విద్యుత్ ఉపకేంద్రం నిర్మిస్తున్నందున భూమి చదును పనుల కాంట్రాక్టు తమకే ఇవ్వాలని పట్టుబట్టారు. కానీ తాము టెండర్ ద్వారా దక్కించుకున్నామని, తాము కూడా సెజ్ నిర్వాసితులమేనని, 'బార్క్'కు కేటాయించిన భూముల్లో తమవి కూడా ఉన్నాయని చిన్నారావు, అతని సోదరుడు వాదించారు. ఈ సందర్భంగా సెజ్ కర్మాగార నిర్మాణ పనుల్లో ఎవరెంత దందా సాగించారో ఇరువర్గాల వారు బయటపెట్టుకున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ భూమి చదును పనులు చేయనిచ్చేది లేదని ఎమ్మెల్యే వర్గీయులు భీష్మించుకోవడంతో టెండర్ పొందిన చిన్నారావు సోదరులు పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం పనులు మొదలుపెడతామని వీరు చెబుతుండగా, ఎలా చేపడతారో చూస్తామని ఎమ్మెల్యే వర్గీయులు అంటున్నారు. దీంతో పోలీసుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా తయారైంది.

### అభిజిత్ ఫ్లై యాష్ విషయంలోనూ ఇదే తీరు!

అభిజిత్ ఫెర్రో కర్మాగారం వ్యర్థాల విషయంలో కూడా గతంలో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఈ ఫ్యాక్టరీలో ఉత్పత్తి సందర్భంగా ఫ్లై యాష్ (బూడిద) వ్యర్థాలు వచ్చేవి. దీనిని నిల్వ చేయడానికి చాలా స్థలం అవసరం అయ్యేది. ఫ్లై యాష్‌ను వదిలించుకోవడానికి ఇటుకల (ఫాల్ జీ బ్రిక్స్) తయారీదారులకు ఉచితంగా ఇస్తామని యాజమాన్యం ప్రకటించింది. అంతేకాక టన్నుకు రూ.20 చొప్పున రవాణా చార్జీలు కూడా ఇస్తామని చెప్పింది. దీంతో ఫాల్ జీ బ్రిక్స్ తయారీదారులు తీసుకెళ్లడం మొదలుపెట్టారు. రోజు వంద లారీలకు తక్కువ లేకుండా ఫ్లై యాష్ రవాణా అయ్యేది. క్రమేపీ డిమాండ్ పెరగడంతో కంపెనీ యాజమాన్యం టన్ను రూ.150కి విక్రయించడం ప్రారంభించింది. ఈ విషయం పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్ వర్గీయులకు తెలియడంతో అభిజిత్ కర్మాగారం యాజమాన్యాన్ని కలిశారు. ఫ్లై యాష్‌ను గంప గుత్తంగా తీసేసుకుని, టన్ను రూ.300కు విక్రయించడం మొదలుపెట్టారు. అంటే ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా టన్నుకు రూ.150 చొప్పున రోజుకు రూ.2-3 లక్షలు జేబులో వేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు వర్గీయులు.. ఫ్లై యాష్ రవాణాను అడ్డుకున్నారు. తరువాత ఇరువర్గాల వారు రాజీపడి ఒక అంగీకారానికి వచ్చారు. ఫ్లై యాష్ ఆదాయాన్ని పంచుకుంటున్నారు.

### నిర్వాసితుల పేరుతో నాయకులు దందా

ప్రత్యేక ఆర్థిక మండలి నిర్వాసితుల పేరుతో కొంతమంది నాయకులు దందా సాగిస్తున్నారు. కర్మాగారాల్లో లేబర్, వర్క్ కాంట్రాక్టర్లను బెదిరించి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. నాయకుల్లో కొంతమందికి సరకు రవాణా వాహనాలు వున్నాయి. ఏ కాంట్రాక్టర్ అయినా తమ వాహనాలే వాడాలని, చెప్పినంత కిరాయి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి సున్నా.. అవినీతిలో మిన్న

- ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తీరుపై టీడీపీ, జనసేన నాయకులు ఆగ్రహం
- లోకేశ్‌ను విమర్శించే స్థాయి లేదని స్పష్టీకరణ
- సీటు రాదన్న నిరాశ నిస్పృహతోనే తప్పుడు ఆరోపణలని ఖండన


విలేకరుల సమావేశంలో తాతయ్యబాబు, పీవీఎస్ఎన్‌రాజు, కేఎస్ఎన్ఎస్ రాజు, మల్లునాయుడు తదితరులు

**చోడవరం, ఫిబ్రవరి 21 :** అభివృద్ధి చేయడం మాని, అవినీతికి పెద్దపీట వేసిన ఎమ్మెల్యే ధర్మశ్రీకి మరో రెండు నెలల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడులు స్పష్టం చేశారు. పట్టణంలోని ఓ కల్యాణ మండలంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరిపాలన చాతగాని ఎమ్మెల్యే ధర్మశ్రీ టీడీపీ నేత నారా లోకేశ్, స్థానిక టీడీపీ, జనసేన నాయకులపై విమర్శలకు దిగడం ఆయన నైజానికి నిదర్శనంగా పేర్కొన్నారు. ధర్మశ్రీకి నియోజకవర్గంలో రోడ్లు వేయించడం చేతగాలేదని ఎద్దేవా చేశారు. బీఎన్ రోడ్డు పనులు ఆగిపోతే కాంట్రాక్టర్‌ను మార్చి పనులు చేయించే అవకాశం ఉందని, అలా చేసే దమ్ములేక ప్రతిపక్షంపై విమర్శలు చేయడం, కులాల పేరుతో వ్యక్తిగత విమర్శలు చేయడం దేనికని వారు ప్రశ్నించారు. నియోజకవర్గానికి మంజూరైన విత్తనశుద్ధి కేంద్రం, రెవెన్యూ కార్యాలయం, రైతు బజార్లు ఎందుకు పూర్తి చేయించలేకపోయారని నిలదీశారు. ఎమ్మెల్యేగా ఆయన అభివృద్ధి కంటే ఇతర అంశాలపైనే దృష్టి ఉంచారన్నారు. ధర్మశ్రీ అవినీతి గురించి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ తెలుసని తాతయ్యబాబు అన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ రాదన్న నిరాశ నిస్పృహతో ధర్మశ్రీ తమపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

గోవాడ చెరకు రైతులకు టీడీపీ హయాంలో ప్రతి 15 రోజులకు పేమెంటు ఇచ్చేవారమన్నారు. ఐదు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేసే ఫ్యాక్టరీని లక్ష టన్నులు కూడా ఆడలేని స్థితికి దిగజార్చింది ఎవరని ప్రశ్నించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ధర్మశ్రీ, అతని సోదరులు షుగర్ ఫ్యాక్టరీలో సాగించిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేగా నూటికి నూరుశాతం విఫలమైన ధర్మశ్రీ, అవినీతిలో నియోజకవర్గ చరిత్రలో నెంబర్ వన్‌గా పేరుతెచ్చుకున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో తెలుగుయువత నాయకులు సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, అల్లం రామప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులలో టీడీపీ విజయం తథ్యం

- లోకేశ్ సభతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం : పీవీజీ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న పీవీజీ కుమార్

**కె.కోటపాడు, ఫిబ్రవరి 21 :** రానున్న ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం బహిరంగ సభతో పార్టీ కేడర్‌లో నూతనోత్తేజం కలిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలం అంతా సమష్టిగా ముందుకు సాగుతామని వివరించారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. శంఖారావం సభను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కసిరెడ్డి అప్పలనాయుడు, జూరెడ్డి రాము, బండారు అక్కన్నపాత్రుడు, పైల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కామేశ్వరరావు

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 21 :** మంగళాపురం పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అతిథిదేవో భవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పత్తి కృష్ణ, వెంకట్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కిత్తంపేట పాఠశాలలో..**

**రావికమతం :** మండలంలోని కిత్తంపేట పాఠశాలలో మాతృ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ సీఆర్‌పీ గుంటూరు రామారావు, ఉపాధ్యాయులు ముందుగా తెలుగు తల్లిచిత్ర పటానికి పూలమాల వేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. భాషా పరిరక్షణకు అంతా కృషి చేయాల్సిందిగా కోరారు. అనంతరం పలు తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జంపెన గ్రామంలో ముగిసిన భజనలు


భక్తిగీతాలను ఆలపిస్తున్న భజన బృందం

**మాడుగుల రూరల్, ఫిబ్రవరి 21 :** మండలంలోని జంపెన గ్రామంలో భీష్మఏకాదశి సందర్భంగా శ్రీరామ భజన బృందం మంగళవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభించిన ఏకాహం బుధవారం ఉదయంతో ముగిసింది. బృందం ప్రతినిధి వానపల్లి ధర్మారం ఆధ్వర్యంలో హరేరామ హరేకృష్ణ నామాన్ని జపిస్తూ భజనలు చేశారు. సర్పంచ్ నేమాని గురువునాయుడు, మానస మహాలక్ష్మి సంస్థ సీఈవో పరమేశ్వరరావు, చింతల్లి, మరిసా లక్ష్మి, గాటీలుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 70 మంది వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

**రోలుగుంట, ఫిబ్రవరి 21 :** బీబీపట్నం గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారిణి సునీత బృందం 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు, కౌన్సిల్ మలసాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 80 మంది ఉద్యోగాలకు ఎంపిక


నియామక పత్రం అందిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్

**చోడవరం, ఫిబ్రవరి 21 :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు మూడొందల మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 80మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. జాబ్‌కు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్లు రఫియుద్దీన్, అప్పలనాయుడు, డి.మాల్యాద్రి, రత్నభారతి, జ్యోతి, పిచ్చమ్మ, కృష్ణారావు, నారాయణమూర్తి, వెంకటేష్, లక్ష్మి, మంగమ్మ రామలక్ష్మి, సరస్వతి, కోమలి, మూర్తి, తాతారావు, శ్రీనివాసరావు, కాలేజీ ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ హెచ్.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుపల్లిలో ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


నమూనా గురించి డీఎస్పీకి వివరిస్తున్న విద్యార్థినులు

**నర్సీపట్నం, ఫిబ్రవరి 21 :** విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణ చాలా అవసరమని డీఎస్పీ బి.వెంకట్రామయ్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడుతుందన్నారు. గత ఏడాది ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులకు రూ.10వేల నగదు బహుమతి అందజేశారు. హెచ్ఎం రామకృష్ణ, రాజగోపాల్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుముద్రాలు పాల్గొన్నారు.

## 'తప్పుడు మెసేజ్‌లకు విద్యుత్ వినియోగదారులు మోసపోవద్దు'

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 21 :** విద్యుత్ బిల్లుల పేరుతో సెల్ ఫోన్‌లకు వస్తున్న తప్పుడు మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దని వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈఈ సోమరాజు వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సర్వీస్ నెంబరు అప్‌డేట్ చేసుకోవాలని, లేకపోతే రాత్రి 10.30 గంటలకు డిస్‌కనెక్ట్ అయిపోతుందని మెసేజ్‌లో పేర్కొంటున్నారన్నారు. దీనికై సంప్రదించాలని 7815821290 ఇచ్చిన నెంబరు, మెసేజ్ ఏపీ ట్రాన్స్‌కో సంబంధం లేదన్నారు. ఈ నెంబరుతో మాట్లాడితే సైబర్ కేటుగాళ్లు లైన్‌లోనికి వచ్చి సర్వీస్ నెంబరుతో పాటు ఆధార్ కార్డు నెంబరు అడుగుతారని, ఆధార్ కార్డుతో లింక్ అయిన బ్యాంకు అకౌంట్ నుంచి నగదు విత్ డ్రా చేయడం ద్వారా నగదు అపహరణకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తప్పుడు మెసేజ్‌లపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఏఈఈ కార్యాలయంలో సంప్రదించాలని ఏఈఈ సూచించారు.

## శ్రీరాంపురంలో గిరినాగు హతం



**గొలుగొండ, ఫిబ్రవరి 21 :** మండల కేంద్రం గొలుగొండ పంచాయతీ శివారు శ్రీరాంపురంలో గ్రామస్థులు గిరినాగు పామును హతమార్చారు. గ్రామంలోని ఓ ఇంట్లోకి మంగళవారం రాత్రి పదిగంటల సమయంలో ప్రవేశించింది. దానిని గుర్తించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టపక్కలవారు వచ్చి హతమార్చారు.



## 'జర్నలిస్టులపై దాడులు అత్యంత దారుణం'

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 21 :** జర్నలిస్టులపై వైసీపీ మూకలు చేస్తున్న దాడులు దుర్మార్గమని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ఖండించారు. బుధవారం వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాప్తాడులో 'సిద్ధం' సభలో సీఎం జగన్‌రెడ్డి ప్రసంగం వినలేక వెళ్లిపోతున్న జనాల ఫొటోలు తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై మూకుమ్మడి దాడి, అలాగే అరాచక శక్తిగా మారిన వైసీపీ సీనియర్ నేత అక్రమాలపై కథనం ప్రచురించినందుకు కాటసాని రాంభూపాలరెడ్డి అనుచరులు ఈనాడు కార్యాలయంపై రాళ్ల దాడి చేయడం అత్యంత దారుణమన్నారు. దాడులకు పాల్పడిన రౌడీ మూకను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి పాల్గొన్నారు.

**నాతవరం :** వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు అన్నారు. బుధవారం ఇక్కడ టీడీపీ నాయకులతో కలిసి మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా వెలికి తీస్తున్న విలేకరులు, ఫొటోగ్రాఫర్లను అభినందించాల్సిందిపోయి, ఇలా దాడులు చేయడం తగదన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ఖండించారు. ఈ సమావేశంలో నాయకులు ఇటంశెట్టి సీతారామ్మూర్తి, పారుపల్లి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## మోదకొండమ్మ ఆలయానికి వెళ్లే దారిలో వ్యర్థాలు తొలగించాలని వినతి

**మాడుగుల, ఫిబ్రవరి 21 :** పట్టణంలోని మోదకొండమ్మ ఆలయానికి వెళ్లే దారిలోని చెరువు పక్కన పలువురు మాంసం, చికెన్ దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పారబోస్తుండడంతో ఆలయానికి వచ్చే భక్తులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆలయ కమిటీ సభ్యులు వాపోయారు. దీనిపై పంచాయతీ పాలక వర్గానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ నెల 27వ తేదీన మోదకొండమ్మ అమ్మవారి తీర్థం జరనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అటువైపుగా వెళ్లనున్నారన్నారు. వెంటనే పంచాయతీ పాలకులు స్పందించి వ్యర్థాలను తొలగించడంతో పాటు దుకాణదారులకు అవగాహన కల్పించాల్సిందిగా కోరుతున్నారు.

## నేడు వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**రోలుగుంట, ఫిబ్రవరి 21 :** మండలంలోని వడ్డిప గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేణుగోపాలస్వామి, వరసిద్ధి వినాయక, లక్ష్మీదేవి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకకు మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడు, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు తదితరులు హాజరుకానున్నట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

## తామరంలో అక్షరాస్యత కేంద్ర ఏర్పాటు


అక్షరాస్యతపై పోస్టర్‌ను విడుదల చేస్తున్న బ్యాంకు సిబ్బంది

**మాకవరపాలెం, ఫిబ్రవరి 21 :** గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకే అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ రాణి తెలిపారు. బుధవారం తామరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ పేమెంట్, ఏటీఎం వాడకం, బ్యాంకింగ్ యాప్, పొదుపు ఉపయోగాలు, డిపాజిట్ పథకాలు తదిరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మణికుమార్, అనిల్‌కుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రికి దిండ్లు వితరణ


రోగులకు దిండ్లు అందిస్తున్న జనసేన నాయకులు

**మాడుగుల, ఫిబ్రవరి 21 :** ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన రోగులకు మంచాలపై దిండ్లు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించిన జన సైనికులు వాటిని సమకూర్చారు. ఈ మేరకు పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ చేతుల మీదుగా వీటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రావుకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు ఇల్లపు రమేష్, ఉపాధ్యక్షుడు మాటూరి గంగమ్మ, నూకరాజు, జనసైనికులు గల్లా గణేశ్, నాగరాజు, పైడినాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదరంగం పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**మాకవరపాలెం, ఫిబ్రవరి 21 :** ఇక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం చదరంగం పోటీలు నిర్వహించారు. సుమారు అరవై మంది విద్యార్థులు హాజరైనట్టు ఉపాధ్యాయులు ఎం.శేషగిరిరావు, రంగరాజు, అచ్యుతరామయ్య, కోచ్ సుధీర్ తెలిపారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

**మాడుగుల రూరల్, ఫిబ్రవరి 21 :** పొంగలిపాక ఎంపీపీ పాఠశాలలో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల సమయాల్లో అప్రమత్తతపై బుధవారం అవగాహన కల్పించారు. మాడుగుల అగ్నిమాపక అధికారి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదాలు జరగడానికి గల కారణాలతో పాటు ఆ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఉపాధ్యాయులుతో పాటు అగ్నిమాపక సిబ్బంది భోగేశ్వరరావు, వరహాలు, నానాజీ పాల్గొన్నారు.

## లంకవానిపాలెంలో చెట్లు దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీటీసీ అనూరాధ

**కె.కోటపాడు, ఫిబ్రవరి 21 :** మండలంలోని లంకవానిపాలెంలో గల తోటల్లో బుధవారం అగ్నిప్రమాదం చోటచేసుకుంది. టేకు, మామిడి, జీడి మామిడి, ఆకేషియా చెట్లు కాలి బూడిదయ్యాయి. ఇది చూసినవారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 17 మంది రైతులకు సంబంధించిన 9.77 ఎకరాల్లోని తోటలు కాలిపోయాయి. జడ్పీటీసీ అనూరాధ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.